Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANIVARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 6 పేజీలు (Pages): 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

ఆదివారం, 29 - 6 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## మోదీకి ధర్మ చక్రవర్తి బిరుదు ప్రదానం




**న్యూఢిల్లీ:** జైన సన్యాసి ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహారాజ్ శతాబ్ది ఉత్సవాలు సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి 'ధర్మ చక్రవర్తి' బిరుదును శనివారంనాడు ప్రదానం చేశారు. ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహారాజ్‌కు ఏడాది పొడవునా నిర్వహించే జాతీయ నివాళికి నాంది పలుకుతూ ఈ శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. జైన నేత ఆధ్యాత్మిక, పండిత వారసత్వాన్ని స్మరించుకు నేందుకు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, ఢిల్లీలోని భగవాన్ మహావీర్ అహింసా భారత్ ట్రస్టు సహకారంతో ఈ శతాబ్ది ఉత్స వాలను నిర్వహిస్తున్నారు. ధర్మ చక్రవరి బిరుదును ప్రధాని స్వీకరిస్తూ, తనను తాను ఈ బిరుదుకు అర్హుడనని భావించడం లేదని, అయితే సాధువుల నుంచి ఏది స్వీకరించినా దానిని ప్రసాదంగా స్వీకరించాలనేది మన సంస్కృతి అని చెప్పారు. ఈ ప్రసాదాన్ని తాను వినయంగా స్వీకరిస్తూ తల్లి భారతికి అంకితమిస్తున్నానని అన్నారు. ఆచార్య విద్యానంద్ జీ 1987 జూన్ 28న 'ఆచార్య' బిరుదును అందుకున్నారని ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఇది కేవలం గౌరవం కాదని, జైన సంస్కృతిని సంయమనం, కరుణతో అనుసంధానించే పవిత్రధార అని అన్నారు. క్రమశిక్షణ, సన్యాసి జీవితాన్ని గుర్తు చేసే వేడుకలు ఇవని పేర్కొంటూ ఆచార్యకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహారాజ్ స్మారక పోస్టల్ స్టాంపును ప్రధానమంత్రి మోదీ, కేంద్ర సంస్కృతి, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ విడుదల చేశారు. దీనికి ముందు 'లైఫ్ అండ్ లెగసీ ఆఫ్ ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహారాజ్' పేరుతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మోదీ, షెకావత్ సందర్శించారు. ఆచార్య ఆధ్యాత్మిక ప్రయాణంలోని కీలక ఘట్టాలను గుర్తు చేసే కుడ్యచిత్రాలను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు.

## 10న తుంగభద్ర జలాల విడుదల


**బళ్లారి (బెంగళూరు) :** తుంగభద్ర డ్యాం నుంచి ఎగువ, దిగువ కాలువలకు జూలై 10న నీరు విడుదల చేయాలని ఐసీసీ నిర్ణయించింది. డ్యాంలో ఉన్న నిల్వల ఆధారంగా నీటిని విడుదల చేయాలని తీర్మానం చేసింది. కర్ణాటకలోని ఆర్‌బీఎంసీ, ఇతర కాలువలకు జూలై 2 నుంచి నవంబరు 31 వరకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించింది. బెంగళూరులోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో శుక్రవారం 124వ ఐసీసీ కమిటీ సమావేశం జరిగింది. అధ్యక్షుడు శివరాజ్ తంగడిడే అధ్యక్షత వహించారు. తుంగభద్ర బోర్డు అధికారులు, కమిటీ సభ్యులు హాజరయ్యారు. డ్యాంలో శుక్రవారం 56.746 టీఎంసీల నీటి నిల్వలు నమోదయ్యాయి. తీర్మానం మేరకు, ఆర్‌బీఎంసీ, కొప్పళ జిల్లా పరిధిలో ఉండే ఆయకట్టుకు జూలై 2 నుంచి 31 వరకు తుంగభద్ర ఎడమ ప్రధాన కాలువ నుంచి రెండు వేల క్యూసెక్కులు వదులుతారు. జూలై 16 నుంచి 31 వరకు మూడు వేల క్యూసెక్కులు, ఆగస్టు 1 నుంచి నవంబరు 30 వరకు 4100 క్యూసెక్కులు వదులుతారు. కుడి ఎగువ కాలువకు జూలై 10 నుంచి జూలై 31 వరకు సగటున 700 క్యూసెక్కులు, ఆగస్టు 1 నుంచి నవంబరు 30 వరకు 1300 క్యూసెక్కులు, కుడి దిగువ కాలువకు జూలై 10 నుంచి జూలై 31 వరకు 500 క్యూసె క్కులు, ఆగస్టు 1 నుంచి నవంబరు 30 వరకు 650 క్యూసెక్కుల నీటిని వదులుతారు. లభ్యత ఆధారంగా వివిధ కాలువలకు నీటిని విడుదల చేయాలని ఐసీసీ తీర్మానం చేసింది.

**2న సీఎంతో చర్చలు**



తుంగభద్ర జలాల విడుదల, ఆనకట్టు భద్రత, పంటల సంరక్షణ తదితర అంశాలపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో జూలై 2 సమావేశం జరుపుతామని ఐసీసీ అధ్యక్షుడు, మంత్రి శివరాజ్ తంగడిగే తెలిపారు. ఈ ఏడాది ఖరీఫకు మాత్రమే నీటిని విడుదల చేస్తామని టీబీపీ బోర్డు అధికారులు తెలిపారు. దీంతో రబీ సాగుపై రైతుల్లో ఆందోళన వ్యక్తమౌతోంది. ఈ అంశంపై మరోసారి సమావేశమై చర్చిస్తామని అధికారులు తెలిపారు. సమావేశంలో తుంగభద్ర బోర్డు ఎస్‌ఈ నారాయణ నాయక్, బోర్డు కర్ణాటక అధికారులు, ఎమ్మెల్యేలు గవియప్ప, పంపన గౌడ బాదర్లి, బసవనగౌడ, మాజీ మంత్రి బి.నాగేంద్ర, సీఏడీఏ అధ్యక్షుడు హసనాసబ్ దోతిహాల్, కె.రాఘవేంద్ర హిట్నాల్, కొప్పళ, బళ్లారి, రాయచూరు, విజయనగరం జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## వల్లభనేని వంశీ బెయిల్‌పై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం




**అమరావతి, (రాజధాని వార్తలు):** గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ కీలక నేత వల్లభనేని వంశీకి ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ ఇచ్చిన బెయిల్‌పై సుప్రీంకోర్ట్‌కు వెళ్లాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సుప్రీంకోర్ట్‌లో ఉన్న అడ్వకేట్ ఆన్ రికార్డ్స్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2019 నుంచి 2024 వరకు గన్నవరం నియోజకవర్గంలో జరిగిన మట్టి అక్రమ తవ్వకాలపై విజిలెన్స్ నివేదిక మేరకు ఏపీ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఏసీబీ నమోదు చేసిన ఈ కేసులో పీటీ వారెంట్ అమలు చేస్తున్నారని హైకోర్ట్‌ను వంశీ ఆశ్రయించారు. అయితే వేకేషన్ కోర్ట్‌లో వంశీకి హైకోర్ట్ బెయిల్ ఇచ్చింది. దీనిపై సుప్రీం కోర్టును ఆశ్రయించాలని హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. మట్టి అక్రమ తవ్వకాలతో ప్రభుత్వానికి రూ.195 కోట్లు నష్టం జరిగిందని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఇంతటి భారీ నష్టం కలిగిన కేసులో హైకోర్ట్ బెయిల్ ఇవ్వడాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వం అడ్వకేట్ ఆన్ రికార్డ్స్‌కు ఆదేశాలు ఇస్తూ హోమ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జీవో జారీ చేశారు. హైకోర్ట్ వంశీకి ఇచ్చిన బెయిల్‌ని రద్దు చేయాలంటూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్ట్‌లో సోమవారం స్పెషల్ లీవ్ పిటీషన్ వేసే అవకాశం ఉంది.

## ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు ఎన్నటికీ ఆస్కారం ఉండకూడదు : కేటీఆర్

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** తెలంగాణలో అరాచకత్వం పెట్రేగిపోతుందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. రేవంత్‌రెడ్డి లాంటి నేతలు ఈ రాష్ట్రాన్ని నడిపిస్తుంటే, అబద్ధాలు, దుష్ప్రచారం అంశాలుగా సమాజంలో రోజువారి సాధారణ అంశాలుగా మారిపోతాయని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు ఎన్నటికీ ఆస్కారం ఉండకూడదని సూచించారు. శాంతియుతంగా ఉండాలని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఇవాళ (శనివారం) తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. అబద్ధాలకు, అసందర్భ ప్రేలాపనలకు, మీడియా ముసుగులో చేసే నీచపు రాజకీయాలకు కూడా అస్సలు తావుండకూడదని సూచించారు. ఈనాటి దిగజారుడు రాజకీయాల్లో అన్ని మెయిన్ స్ట్రీమ్‌కి తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన మిత్రులకే ఈ పాపమని విమర్శించారు. బీఆర్‌ఎస్ సోదర, సోదరీమణులందరూ ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్‌పై ముఖ్యమంత్రి, ఆయన అనుచరగణం చేస్తున్న బురదల్లే కుట్రపూరిత కార్యక్రమంపై చట్టబద్ధమైన ప్రక్రియను నమ్మి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు మాజీ మంత్రి కేటీఆర్. పార్టీపైన శ్రేణులకు ఉన్న ప్రేమను, నిబద్ధతను తాను పూర్తిగా అర్థం చేసుకోగలనని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకొచ్చారు. అదేవిధంగా పార్టీపై, నాయకులపై జరుగుతున్న దుష్ప్రచారంపై మీలో ఉన్న ఆవేదనను కూడా తాను అర్థం చేసుకోగలనని అన్నారు. ఈ విషయాల్లో న్యాయస్థానాలను ఆశ్రయిద్దామని సూచించారు.

## మాజీ ప్రధాని పీవీని స్మరించుకున్న చంద్రబాబు, లోకేష్




**అమరావతి, (రాజధాని వార్తలు):** మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు 104వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నివాళులర్పించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. పీవీని స్మరించుకున్నారు. ఆయన తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలను దేశ పరిస్థితిని మార్చేశాయని గుర్తు చేసుకున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి మాజీ ప్రధాని అంటూ కొనియాడారు.

**చంద్రబాబు ట్వీట్**

'భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గారి 104వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉండగా ప్రధాని బాధ్యతలు స్వీకరించి ఆర్థిక సంస్కరణల ద్వారా దేశగతిని మార్చిన పీవీ ఎప్పటికీ స్ఫూర్తిగానే నిలుస్తారు. ఆ మహనీయుడి స్మృతికి మరొక్కమారు నివాళి అర్పిస్తున్నాను' అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

## స్మార్ట్ పోలీసింగ్‌తో నేరాలకు అడ్డుకట్ట : హోంమంత్రి అనిత

**విజయవాడ, (రాజధాని వార్తలు):** మహిళల రక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. నేడు శక్తి యాప్ ద్వారా మహిళలకు భద్రత, భరోసా ఇస్తున్నామని ఉద్ఘాటించారు. మొబైల్ మన చేతిలో ఉంటే.. ప్రపంచం మొత్తం మన చేతిలోనే ఉంటుందని సీఎం చంద్రబాబు చెబుతారని గుర్తు చేశారు. అదే మొబైల్‌ను మనకు రక్షణగా, అస్త్రంగా వినియోగించుకోవాలని సూచించారు. ఇవాళ (శనివారం) విజయవాడ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సురక్ష 360 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి అనిత పాల్గొని మాట్లాడారు. ఆపదలో ఉన్న వారు వాట్సాప్ నెంబర్‌కు ఒక్క మెసేజ్ చేస్తే పోలీసులు వెంటనే అప్రమత్తం అవుతారని హోంమంత్రి అనిత చెప్పుకొచ్చారు. సీసీ కెమెరాల ద్వారా ఏపీలో నేరాల సంఖ్య తగ్గిందని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ టెక్నాలజీ వినియోగంలో ముందంజలో ఉందని ప్రశంసించారు. ఎక్కడ నేరం జరిగినా, ట్రాఫిక్ స్తంభించినా.. అసాంఘిక శక్తుల అడ్డాలను టెక్నాలజీ ద్వారా గుర్తించి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అస్త్రం యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తున్నారని చెప్పారు. నేడు పోలీసింగ్ అనేది ప్రజలకు చాలా చేరువ అవుతుందని తెలిపారు హోం మంత్రి అనిత. మోడల్ పోలీస్ స్టేషన్‌ను ఎన్టీఆర్ జిల్లా మొత్తం విస్తరించాలని హోంమంత్రి అనిత సూచించారు. సురక్ష యాప్, సురక్ష డివైస్ వల్ల ప్రజలకు ఎంతో మంచి జరుగుతోందని ఉద్ఘాటించారు. ఏపీలో ఇటీవల ఆన్‌లైన్ మోసాలు కూడా బాగా పెరిగాయని చెప్పారు. ప్రజలు కూడా అజ్ఞాత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని కోరారు. ఇలాంటి మోసాలను కూడా అరికట్టేందుకు టెక్నాలజీ ద్వారా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. ప్రజల భద్రత కోసం ఏపీ పోలీస్ శాఖ, తమ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. స్మార్ట్ పోలీసింగ్, ఇన్విజిబుల్ పోలీసింగ్‌తో నేరాలకు అడ్డుకట్ట వేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో వీఐపీ, వీవీఐపీలు ఎక్కు వగా ఉంటే భద్రత చాలా అవసరమని తెలిపారు. డ్రోన్లు, సీసీ కెమెరాలతో ఎక్కడ అసాంఘిక కార్యక్రమాలు జరిగిన అడ్డుకట్ట వేస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.



## పిటిషనర్లపై తొందరపాటు చర్యలొద్దు

### - బాణసంచా కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం



**అమరావతి, (రాజధాని వార్తలు):** వైసీపీ నేతలకు హైకోర్టులో ఉపశమనం లభించింది. ఎన్నికల సందర్భంగా బాణాసంచా కాల్చడంతో గాయపడ్డానంటూ పసల లోకేశ్ అనే యువకుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తొందరపాటు చర్యలు తీసుకోవద్దని అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె పోలీసులను కోర్టు ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. లోకేశ్ ఫిర్యాదు ఆధారంగా లక్కిరెడ్డిపల్లె పోలీసులు ఈనెల 25న కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి, మరో 17 మంది హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా.. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది శ్రీరామ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయి రోహిత్ వాదనలు వినిపించారు.

## ప్రతి వార్డుకు రూ. 10 లక్షలు కేటాయించాం

### - చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి

**బుచ్చిరెడ్డిపాలెం ప్రతినిధి, (రాజధాని వార్తలు):** బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో ప్రతి వార్డుకు 10 లక్షలు కేటాయించినట్లు చైర్ పర్సన్ మురళి సుప్రజా మురళి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ప్రశాం తంగా కౌన్సిలర్ సమావేశం నిర్వహించారు. బుచ్చి నగర పంచా యతీ సాధారణ సమావేశాలు,10 అజెండాలు ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులకు చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి ధన్యవాదాలు తెలిపారు. వివిధ పాలనాపర అనుమతుల కోసం చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి అధ్యక్షతన జరిగిన బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ సాధారణ సమావేశాలు ప్రశాంతంగా జరిగాయి. పరిపాలన సంబంధిత 10 అజెండాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు మరియు కోఆప్షన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. బుచ్చి పట్టణంలోని ప్రతి వార్డులో 10 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్న ట్టు ఆమె పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశా లలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులతో పాటు నగర పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.




# చెత్త నుండి సంపద తయారీ కేంద్రం పరిశీలన





**దర్శి ప్రతినిధి, (రాజధాని వార్తలు):** డి ఎల్ డి వో శ్రీనివాస్ రెడ్డి కురిచేడు గ్రామపంచాయతీ నందు చెత్త నుండి సంపద తయారీ కేంద్రం నందు ఎస్ డబ్ల్యు పి సి షెడ్ పరిశీలించి షెడ్ వద్ద బాత్రూం, పూల మొక్కలు సోలార్ లైట్ కెమెరా మరియు క్లాత్ మిత్రుల జీతం బకాయి లేకుండా చెల్లించమని ఆదేశించారు చుట్టూ ప్రహరీ గేటు పెయింటింగ్ మొదలగు అంశాలపై చర్చించారు గ్రామ పంచాయతీ పరిధిలో పాలిథిన్ కవర్స్ ఎవరు ఉపయోగించ కుండా చూడమన్నారు, టీ కొట్టులో మరియు రెస్టారెంట్ వద్ద ప్రత్యేకమైన డస్ట్‌బిన్ ఏర్పాటు చేసి చెత్తను అందులోనే పడేయా ల్సిందిగా టీ కోట్ల యజమానులకు ఆదేశించారు. ఎస్ డబ్ల్యూ పిసి రిక్షాలు మరమ్మత్తులు చేయించమన్నారు మండలంలోని ప్రతి పంచాయతీ సెక్రటరీ ఉదయం 7:00 కల్లా ఫీల్డ్‌లో ఉండి క్లాత్ మిత్రుల పనులు పరిశీలించి నోట్ క్యాంపుతో ఫోటోలను గ్రూప్‌లో పోస్ట్ చేయమన్నారు. మరియు ఆర్థిక సంఘం నిధులను టైట్ అండ్ టైట్ గ్రాంట్ జీవో ప్రకారం మాత్రమే ఖర్చు చేయవలెనని ఆదేశించారు. అట్లు చేయని యెడల ఆ పంచాయతీ కార్యదర్శిపై జిల్లా కలెక్టర్‌కి చేయవలసి వస్తుంది అని ఆదేశించారు.

# వెలుగు ఏపిఎం, సిసిపై ఫిర్యాదు చేసిన పొదుపు మహిళ






**వెంకటగిరి ప్రతినిధి, (రాజధాని వార్తలు):** మండల కార్యాలయంలో పరిధి లోని వెలుగు కార్యాలయం ముందు సిద్ధవరం గ్రామానికి చెందిన ఆవుల భారతిని సుప్రజ పొదుపు సంఘం నుండి అక్రమంగా అధికారులు తొలగించారని వెంకటగిరి పోలీస్ స్టేషన్లో వెలుగు అధికారి ఏపీ ఎంసిసిపై ఫిర్యాదు చేశారు. మీడియాతో మాట్లాడు తూ గత 15 ఏండ్లుగా మా గ్రామంలోని మహిళలతో కలిసి సుప్రజ పొదుపు సంఘం లీడర్‌గా మరియు సభ్యురాలుగా కొనసా గుతూ బ్యాంకు నుండి వెలుగు పొదుపు నుండి తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తూ ఎటువంటి విభేదాలు లేకుండా పొదుపు గ్రూప్‌ని అభివృద్ధి చేశాం.

గత రెండు నెలల నుండి మా గ్రూప్ సభ్యులు నాకు తెలియకుండా నన్ను పొదుపు గ్రూపు నుండి తొలగించి కుట్ర పన్నారు, ఆ స్థానంలో గ్రూప్ లీడర్ బంధువులు మరో మహిళకు పొదుపు సభ్యురాలుగా చేర్చుకొనుటకు అజెండా తీర్మానం తయారు చేశారు. ఆ విషయంపై వెలుగు అధికారులు దృష్టికి తీసుకెళ్ళాను, మండల ఏపీఎం శైలజ సిసి రమేష్ అధికా రులు నాకు న్యాయం చేయాలని కోరాను. గత 15 ఏళ్ల నుంచి తీసుకున్న లోను రుణాలు సక్రమంగా చెల్లించి ఈ గ్రూపులోని సభ్యులకు నూతన లోను ఒక్క మహిళకు రెండు లక్షలు లోను రుణం మంజూరు జరిగింది రుణం పొందే సమయములో నన్ను తొలగించడం అన్యాయం అని ప్రశ్నించినందుకు మా గ్రూపు సభ్యులు నన్ను మానసికంగా వేధింపులకు గురి చేశారు, ఆ మానసిక ఒత్తిడి తట్టుకోలేక తొలుత ఆత్మహత్యకు పాల్పడ్డాను మా కుటుంబ సభ్యులు నన్ను కాపాడారు, ఈ విషయము మండల పొదుపు ఏపిఎం అధికార దృష్టికి వెళ్లడంతో ఆమె గ్రూపు సభ్యులకు ఆవుల భారతిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని పిలుపునివ్వడంతో వారు నాపై ఫిర్యాదు చేశారు, నన్ను ఎంత ఇబ్బంది పెడుతున్న వెలుగు ఏపీఎం శైలజ, సీసీ రమేష్‌పై పొదుపు సభ్యులపై చర్యలు తీసుకోవాలని నాకు న్యాయం చేయాలని జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. నాకు ప్రాణహాని ఉందని నాకు ఏమైనా జరిగిన పూర్తి బాధ్యత వెంకటగిరి మండల వెలుగు ఏపీఎం మరియు సిసి అధికారులు వారే బాధ్యత వహించాలని అన్నారు. నన్ను పొదుపు గ్రూపు నుండి కారణము లేకుండా తొలగించడం అన్యాయం నేను అదే గ్రూపులో సభ్యురాలుగా కొనసాగించాలని కొనసాగేంత వరకు న్యాయపోరాటం చేస్తారని అన్నారు.

# విద్యా రంగ సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలం




**నెల్లూరు/కోవూరు, (రాజధాని వార్తలు):** ఏపీ కూటమి ప్రభుత్వం విద్యా రంగ సమస్యలను పరిష్కరించడములో విఫలం అయిందని పి డీఎస్‌యు మాజీ రాష్ట్ర అధ్యక్షులు సి.ఎస్.సాగర్ అన్నారు. శనివారం నెల్లూరు నగరంలో సిటీ జనరల్ బాడీసమావేశము నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి విచ్చేసి ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం రోజులవుతున్న రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించ డంలో పూర్తిగా విఫలం అయిందని ఆందోళన వ్యక్తం చేసారు. విద్యను అంగట్లో సరుకులాగా విద్యార్థులు కొనాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడం. పట్ల విద్యార్థులు హాజరు తగ్గిందని గ్రామీణ ప్రాంతాలలో స్కూల్స్ క్లోజ్ చేయడం కూటమి ప్రభుత్వానికి సిగ్గు చేటు అని అన్నారు. జిల్లా అధ్యక్షులు ఎం సునీల్ మాట్లాడుతూ అధికారంలోకొస్తానే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పూర్తిగా చేస్తానన్న మంత్రుల లోకేష్ ఇప్పటికీ నిరుద్యోగ సమస్యలు పట్టిం చుకోవడం లేదని అన్నారు. విద్య మొత్తం కార్పొరేట్ ప్రైవేట్ కబంధ హస్తాల్లో ఉంటే విద్యాశాఖ మంత్రి అయినా మంత్రు లోకేష్ పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. విద్యాశాఖ మంత్రి విద్యారంగ సమస్యలు పట్టించుకోకపోతే తొందరలో మంత్రి లోకేష్ ఆఫీస్ ముట్టడిస్తాం అని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి ఎస్కె షారుక్ మాట్లాడుతూ విద్యార్థులు సమస్యల కోసమే పిడిఎస్‌యు ఉంది కనుక నెల్లూరు సిటీలో ఉన్న విద్యార్థులు అందరూ వారి హక్కుల కోసం పోరాటం చేయాలి. నెల్లూరు సిటీలో సంక్షేమ హాస్టల్ పరిస్థితి దారుణంగా ఉంది. న్నారు.హాస్టల్ సమస్య కోసం పిడిఎస్‌యు పోరాటం చేస్తుంది. ఈ కార్యక్ర మంలో పిడిఎస్‌యు నగర అధ్యక్షులు కే.ఆషిర్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్కే అన్నవర్ మస్తాన్, నవీన్, సుబ్బు, హర్ష, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

# మహా న్యూస్ ఛానెల్ కార్యాలయంపై దాడి దుర్మార్గమైన చర్య

## - బీజేపీ జిల్లా కార్యదర్శి చిలక ప్రవీణ్ కుమార్

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మహా న్యూస్ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై బి ఆర్ ఎస్, గుండాలు హైదరాబాద్‌లో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ జిల్లా కార్యదర్శి చిలక ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయనశనివారం మాట్లాడుతూ "ప్రజాస్వామ్యంలో ఇలాంటి హింసాత్మక చర్యలకు ఎక్కడా స్థానం ఉండదని" అన్నారు. మీడియా చూపించే వార్తలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే, వాటిని పరిష్కరించడానికి కోర్టులు చట్టాలు ఉన్నాయి," అని ఆయన చెప్పారు. "ఆ నియమాలను పక్కన పెట్టి హింసను ఆశ్రయించడం అనహ్యాకరం, న్యాయవిరుద్ధం."మహా న్యూస్ ఛానె ల్‌పై జరిగిన దాడిని అన్ని ప్రజాస్వామిక శక్తులు ఖండించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఇది మీడియా స్వేచ్ఛపై, ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడిగా ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకుని, దోషులను చట్టపరంగా శిక్షించాలన్నారు. దోషులను గుర్తించి, వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవా లని మేము ప్రభుత్వాన్ని కోరుతున్నాం," అని చిలక ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.



# దివ్యాంగులకు, మంచం పట్టిన వృద్ధులకు రేషన్ పంపిణీ చేసేందుకు పరిశీలించిన తహసీల్దార్ సుబ్బయ్య



**కోవూరు, (రాజధాని వార్తలు):** ప్రభుత్వం ఇటీవల రేషన్ పంపిణీలో కొత్త విధానాన్ని ప్రవేశం పెట్టడములో భాగంగా కోవూరు మండలంలోని అన్ని పంచాయతీలలో గల రేషన్ షాపులకు పరిధిలో ఉన్న దివ్యాంగులు, ఆరోగ్యం సరిలేని 65 ఏళ్ల పై బడిన వృద్ధులకు వారు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చెయ్యడము కొరకు శనివారం పరిశీలించడం జరిగింది అని కోవూరు మండలం తహసీల్దార్ సుబ్బయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే 2440మంది పైన చెప్పిన జాబితాలో ఉన్నారని వారిని గుర్తించి ఇప్పటికే 791 రేషన్ కార్డు దారులకు ఇంటి వద్దే సరులకులు పంపిణీ చేశామని మిగతా కూడా త్వరితగతిన రేషన్‌ను డీలర్లు ద్వారా అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది, చౌక దుకాణం డీలర్లు ఉన్నారు.

# కూటమి ప్రభుత్వంలో ఏడాది పాలనలో బీసీలకు మేలు

## - ముఖ్యమంత్రి, చంద్రబాబు నాయుడు కృషి ఎంతో అభినందనీయం

## - విడవలూరు టిడిపి మండల బీసీ సెల్ అధ్యక్షులు చిన్ని బాబు



**విడవలూరు, (రాజధాని వార్తలు):** ఏపీలో ఏడాది పాలనలో బీసీలకు రెట్టింపు మేలును ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే సాధ్యం అయిందని విడవలూరు మండల బీసీ సెల్ అధ్యక్షులు చిన్ని బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లో 34శాతము మందికి బీసీలకు పదవులు ఇచ్చి కూటమి ప్రభుత్వం ఎంతో మేలు చేసిందని విడవలూరు మండలం బీసీ సెల్ అధ్యక్షులు, చిన్ని బాబు అన్నారు. సంక్షే మానికి కూటమి ప్రభుత్వం బడ్జెట్లో 47,456 కోట్ల రూపాయల నిధులను కేటాయించటం అభినందనీయచర్య అన్నారు. అంతే కాకుండా ప్రతి జిల్లాలో ఒక బీసీ భవనం ఏర్పాటు చేసేందుకు 240 కోట్ల రూపాయల నిధులను కేటాయించారని బీసీ సబ్ ప్లాన్ ద్వారా 896 కోట్ల రూపాయల నిధులను మంజూరు చెయ్యడం జరిగింది అన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో నామినేటెడ్ పదవులలో బీసీలకు 34 శాతం పదవులను ఇవ్వడం శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలను అందజేయడం, ఆదరణ పథకం పున ప్రారంభించి స్వయం ఉపాధి కల్పించడం, బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకు రావడం, హత్యకు గురైనటువంటి తోట చంద్రయ్య, అమర్నాథ్ గౌడ్, జల్లయ్య వంటి వారి కేసులను రీఓపెన్ చేసి వారికి న్యాయం జరిగేలా చూడడం వంటి ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను బీసీలకు న్యాయం చేసిన ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడుకే ఘనత దక్కిందన్నారు. కోవూరు నియోజకవర్గం లో ఎంతోమంది శాసనసభ్యులు నియోజకవర్గాన్ని పరిపాలించారని కానీ ఇంతవ రకు కోవూరు నియోజకవర్గం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చేస్తున్న ప్రజాసేవ కానీ ప్రతినిత్యం పప్రజా సమస్యలు పట్ల స్పందించి తాను సొంత నిధులు కూడా లెక్క చెయ్యకుండా బాధితులకు అండగా ఉండి మనోధైర్యాన్ని కల్పించడం చేస్తున్న ఏకైక ఎమ్మెల్యే ప్రశాంతమ్మకే ఈ ఘనత దక్కింది. కోవూరు నియోజకవర్గం ము 200కోట్ల రూపాయలు పైగా అభివృద్ధి కార్యక్రమాలను ఏడాది పాలనలోనే చేసి చూపించిన ఏకైక మహిళా ఎమ్మెల్యేగా ప్రశాంతమ్మకే సాధ్యం అయిందని అన్నారు. ఏడాది పాలనమొత్తములో 90 శాతం పైగా నియోజకవర్గం పర్యటనకే సమయంను కేటాయించి నిరంతరం ప్రజా సేవకే అంకితం అయిన వేమిరెడ్డి దంపతులకు పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కులాలకు, మతాలకు పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ పాలనలో చిత్తశుద్ధి ఉందని ఆమెకు అందరూ రుణ పడి ఉన్నామని మత్స్యకార నేత, బీసీ సెల్ అధ్యక్షులు చిన్ని బాబు అన్నారు.

# 30న విశాఖ పట్నంలో ఫిష్ కాన్ బోర్డు మెంబెర్స్ సమావేశం

## - ఏపీ ఫిష్ కాన్ డైరెక్టర్ ప్రళయ కావేరి వేణు గోపాల్



**విడవలూరు, (రాజధాని వార్తలు):** 30 జూన్ 2025 సోమవారం10 నుండి 3 గంటల వరకు ఫిష్ కాన్ రాష్ట్ర బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, సలహాదారుల సమావేశం నిర్వహించడం జరుగుతుంది అని ఏపీ ఫిష్ కాన్ డైరెక్టర్ ప్రళయ కావేరి వేణుగోపాల్ అన్నారు. ఈ సమావేశములో ప్రధాననంగా మత్స్యకారుల సంక్షేమం కొరకు చర్చించి ప్రభుత్వం ద్రుష్టికి పంపడము జరుగుతుంది అన్నారు. అనంతరం అదేరోజు మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ పథకాల అవగాహన వర్క్ షాపునిర్వహించడం జరుగుతుంది. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్ అజెండాలో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ & సలహాదారుల రిజిస్ట్రేషన్ అండ్ పరిచయాలు ప్రధాన కార్యదర్శి 6 నెలలు నివేదిక సమర్పణ, ఫిష్ కాన్ వెబ్ సైట్ ప్రారంభంజరుగుతుంది. మత్స్యకారుల 18 సమస్యలపై ఇష్టా గోష్టి చర్చి జరుగుతుంది బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ రోల్స్ అండ్ రెస్పాన్సిబిలిటీలు గౌరవ అధ్యక్షు లు సలహా, సూచనలు సలహాదారుల సలహాలు, సూచనలుజిల్లాల కన్వీనర్లు డిసెంబర్ 2025 లోపు నియామకాలపై చర్చ సెప్టెం బరులో జరగనున్న రాష్ట్ర స్థాయి మత్స్యకారుల పాలసీ డ్రాఫ్ట్ ప్రతిపాదనపై వర్క్ షాపు వేదిక ఖరారు. ఇతర మత్స్యకార సం ఘాల ప్రతనిధుల్ని వర్క్ షాపుకు ఆహ్వానించడంపై చర్చ ఉం టుంది. డిసెంబర్ 2025లో రెండవ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ & సలహా దారులు కన్వీనర్లు సమావేశం మరియు బహిరంగ సభ వేదిక ఖరారుపై చర్చ 2025 మార్చి, ఏప్రిల్, మే నెలలో జాతీయ మత్స్యకారుల సమావేశాలకు హాజరు కావడం, FIFO లో జాతీయ ప్రధాన కార్యదర్శి నియామకం, WFF అంతర్జాతీయ మత్స్యకారుల సమావేశ వివరాలు.WFF (వరల్డ్ ఫిష్ హార్వెస్ట్ అండ్ ఫిష్ వర్కర్స్ ఫోరమ్) FIFO (ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫిషర్ ఆర్గనైజేషన్స్) ECFWU (ఈస్ట్ కోస్ట్ ఫిష్ వర్కర్స్ యూనియన్) లతో కలిసి పని చేయడంపై చర్చ జరుగుతుంది. ఫిష్ కాన్ ఉద్దేశ్యాలు, విజన్, మిషన్‌పై చర్చ, కొంత మంది ఫిష్‌కాన్ రాష్ట్ర డైరెక్టర్లు, సలహాదారులు, జిల్లా కన్వీనర్లు తొలగింపులు, ఆమోదములు ఫిష్ కాన్ రాష్ట్ర డైరెక్టర్స్, రాష్ట్ర సలహా దారులు నూతన నియామకాలు జరుగుతుందని అన్నారు. ఫిష్ కాన్ రాష్ట్ర బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లకు, సలహాదారులకు ఐడెంటిటీ కార్డులు, విజిటింగ్ కార్డులు మరియు లెటర్ హెడ్స్ అందజేయ WTO (ప్రపంచ వాణిజ్య సంస్థ) సబ్సిడీలపై చర్చ VGSSF (UNFAO) చిన్నతరహా మత్స్యకారుల స్వచ్ఛంద మార్గదర్శకాలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుంది అన్నారు. ఫిష్ కాన్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ గ్రూపు, ఫిష్ కాన్ టీమ్ గ్రూపు, జిల్లాల వారీగా ఫిష్ కాన్ వాట్సాప్ గ్రూపుల ఏర్పాటు, నియమ నిబంధనలపై సుదీర్ఘ సమావేశము జరుగుతుంది. ఫిష్ కాన్ విస్తరణ మరియు భవిష్యత్తు ప్రణాళికాపై చర్చ. NFDB -PMMSY పథకంపై సమీక్ష, బీచ్ టూరిజంపై సమీక్ష మత్స్యకారుల్ని రైతులుగా గుర్తింపుపై ప్రభుత్వం ద్రుష్టికి తీసికెళ్లే అంశంలపై చర్యలు తీసుకొంటారు. ఫిష్ కాన్ ఆదాయం, ఖర్చుల వివరాలు ఫిష్ కాన్ సంస్థ బలోపేతం కొరకు సభ్యత్వాలు నమోదు ప్రణాళికలు, వివరాలు సిద్ధం చేస్తారు. ఈ సమావేశానికి ఫిష్ కాన్ రాష్ట్ర అధ్యక్షులు అధ్యక్షత సమావేశం నిర్వహించడం జరుగుతుంది ప్రధాన అజెండా. కేంద్ర ప్రభుత్వ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి పెద్దలు వివరిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా ఫిష్ కాన్ వ్యవస్థపకులు ఆర్ జెల్లీ దాస్ ముఖ్య అతితిగా పాల్గొనున్నారు. ఏపీలో ఉన్న ఫిష్ కాన్‌కు చెందిన డైరెక్టర్లు, మేధావులు, మత్స్యకార నాయకులు, ఆయా జిల్లాల ఫిష్ కాన్ అధ్యక్షులు తప్పక హాజరు కావాలని బోర్డు మెంబర్లు పిలిపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొని అమూల్యమైన అంశాలను అందుకోంటారని అర్జెల్లి దాసు అన్నారు.

# చక్కటి సంసారానికి చైతూ–శోభిత కండీషన్స్..!



నాగ చైతన్య, శోభితల జోడీ గురించి ఈమధ్య కాలంలో సోషల్ మీడియాలో ప్రముఖంగా చర్చ జరుగుతోంది. ఇద్దరూ చూడముచ్చటగా ఉంటారు, ఇద్దరి మధ్య అన్యోన్యత కనిపిస్తూ ఉంటుందనే టాక్ వినిపిస్తూ ఉంటుంది. ముఖ్యంగా అఖిల్ వివాహం సమయంలో వీరి జోడీ అందరి దృష్టిని ఆకర్షించింది. కొత్త జంట కంటే ఈ జంట చూడముచ్చటగా ఉన్నారు అంటూ చాలా మంది ఆ సమయంలో కామెంట్ చేయడం మనం చూశాం. నాగ చైతన్యకి ఇది రెండో వివాహం అనే విషయం తెల్సిందే. దాంతో చాలా మంది వీరి వివాహం సమయంలో అనుమానాలు వ్యక్తం చేశారు. కానీ అందరి అంచనాలను తారుమారు చేస్తూ, ఇండస్ట్రీ మాత్రమే కాకుండా అందరూ కుళ్లకునే విధంగా నాగచైతన్య, శోభితలు అన్యోన్యంగా ఉంటున్నారని అక్కినేని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. నాగ చైతన్య, శోభితలు ఇద్దరు సినిమాల్లో ఉన్నారు. ఇద్దరికీ బిజీ షెడ్యూల్ ఉంటుంది. ఇండస్ట్రీకి చెందిన చాలా మంది సెలబ్రిటీ కపుల్స్ బిజీ షెడ్యూల్ కారణంగా ఒకరికి ఒకరు సమయం ఇచ్చుకోలేకపోతారు. దాంతో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తుతాయి. అలాంటి సమస్య రాకుండా ఉండేందుకు గాను నాగ చైతన్య, శోభిత ముందుగానే కండీషన్స్ పెట్టుకున్నారట.

తాజాగా ఈ విషయాన్ని నాగ చైతన్య ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. ఒక జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నాగ చైతన్య మాట్లాడుతూ తన ఫ్యామిలీ లైఫ్ గురించి చెప్పుకొచ్చాడు. ముఖ్యంగా వ్యక్తిగత జీవితంలో తీసుకుంటున్న జాగ్రత్తలను ఆయన చెప్పుకొచ్చాడు. ఆ ఇంటర్వ్యూలో నాగ చైతన్య మాట్లాడుతూ... ఇద్దరం ఇండస్ట్రీలో ఉన్న కారణంగా చాలా బిజీగా ఉంటాం. అలాంటి సమయంలో ఇద్దరికి కలిసే సమయం తక్కువ ఉంటుంది. ఇద్దరం కలిసి మాట్లాడుకోవడంకు సమయం తక్కువ ఉంటుంది. అందుకే క్వాలిటీ టైం స్పెండ్ చేయడం కోసం, ఇద్దరం కలిసి ఎక్కువ సమయం గడపడం కోసం మేము ఇద్దరం కలిసి, మాట్లాడుకుని కొన్ని కండీషన్స్ పెట్టుకున్నాము. అందులో భాగంగా మేము ఇద్దరం హైదరాబాద్‌లోనే ఉంటే తప్పకుండా ఉదయం బ్రేక్‌ఫాస్ట్, నైట్ డిన్నర్ కలిసి చేయాలని కండీషన్ పెట్టుకున్నాం. అంతే కాకుండా మేము ఇద్దరం కచ్చితంగా వీకెండ్స్‌లో కలిసి ఉండాలని నిర్ణయించుకున్నాం. ఆ సమయంలో ఇష్టమైనది ఆర్డర్ చేసుకుని తినడం, ఇష్టం అనిపించింది వండుకుని తినడం, ఇద్దరం కలిసి ట్రిప్స్‌కు వెళ్లడం, డ్రైవ్‌కి వెళ్లడం చేస్తామని నాగ చైతన్య చెప్పుకొచ్చాడు.

# అల్లు అర్జున్‌తో... అసలు ఆలోచనే లేదు!



పుష్ప సినిమాతో బాలీవుడ్‌లో అల్లు అర్జున్ స్టార్‌డం అమాంతం పెరిగింది. ఆయన సినిమాల కోసం హిందీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇలాంటి సమయంలో బాలీవుడ్ మీడియాతో పాటు, సౌత్ మీడియాలో ఒక వార్త తెగ చక్కర్లు కొట్టింది. త్వరలో అల్లు అర్జున్ ఒక హిందీ సినిమా చేయబోతున్నాడు. ఆ సినిమాలో ఆమీర్ ఖాన్ కూడా నటించే అవకాశాలు ఉన్నాయి. ఇద్దరి కాంబోలో గీతా ఆర్ట్స్ వారు భారీ సినిమాను నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. ప్రముఖ బాలీవుడ్ నిర్మాత కూడా ఈ సినిమా నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించబోతున్నాడు అంటూ వార్తలు వచ్చాయి. ఈ వార్తలపై స్వయంగా ఆమీర్ ఖాన్ స్పందించాడు. ఇటీవల ఆయన నటించిన సితారే జమీన్ పర్ సినిమా విడుదల అయింది. ఆ సినిమా ప్రమోషన్ సమయంలో మాట్లాడుతూ... టాలీవుడ్‌కి చెందిన అల్లు అరవింద్ ఫ్యామిలీతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. గజిని సినిమా వారితో కలిసి చేయడం వల్ల సాన్నిహిత్యం పెరిగింది. అల్లు అర్జున్‌ను చినప్పటి నుంచి చూస్తున్నాను. గజిని సినిమా సమయంలో అతడితో మరింత పరిచయం ఏర్పడింది. మేము సందర్భానుసారంగా కలుస్తూ వస్తున్నాం. ఇద్దరి మధ్య సుదీర్ఘమైన స్నేహం కొనసాగుతుంది. కానీ మేము ఇద్దరం కలిసి నటించబోతున్నాం అనే వార్తలు మాత్రం నిజం కాదు. ఇప్పటి వరకు ఆ ఆలోచన కూడా నా వద్దకు ఎవరూ తీసుకు రాలేదు. నేను ఎప్పుడూ ఆ ఆలోచన చేయలేదు. మీడియాలో ఆ వార్తలు చూసి షాక్ అయ్యాను. మేము ఇద్దరం కలిసి ఒకసారి దిగిన ఫోటో కారణంగా ఆ వార్తలు వచ్చి ఉంటాయని అనుకుంటనున్నాను. ముందు ముందు మా కాంబోలో సినిమా వస్తుందేమో చెప్పలేను.. కానీ ఇప్పుడు మాత్రం ఆ ఆలోచన కూడా లేదని క్లారిటీ ఇచ్చాడు. అల్లు అర్జున్ బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తే అది ఆమీర్ ఖాన్ మూవీతో అయితే బాగుంటుందని చాలా మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. డైరెక్ట్‌గా సోలో హీరోగా హిందీలో సినిమా చేయడం కంటే మొదట ఆమీర్ ఖాన్ వంటి స్టార్ హీరో సినిమాలో నటించడం ద్వారా హిందీ ప్రేక్షకులకు చేరువ కావచ్చు అనే అభిప్రాయంను విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు.

అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో సిని మాను చేస్తున్నాడు. ఆ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకునే హీరోయిన్‌గా నటిస్తుంది. దాంతో బాలీవుడ్ లోనూ ఈ సినిమాతో అల్లు అర్జున్ సత్తా చాటడం ఖాయం. తెలుగులో చేసిన సినిమాలే హిందీలో డబ్ అయ్యి భారీ విజయాలను సొంతం చేసుకుంటున్న నేపథ్యంలో డైరెక్ట్‌గా వెళ్లి హిందీ సినిమాలు తీయాల్సిన అవసరం ఏంటని కొందరు అంటున్నారు. ప్రస్తుతానికి అల్లు అర్జున్‌కి ఆ ఆలోచన లేదని తెలుస్తోంది. భవిష్యత్తులో ఏమైనా హిందీ సినిమాను చేస్తాడా... చేస్తే ఆమీర్ ఖాన్‌తో కలిసి నటిస్తాడా అనేది తెలియాల్సి ఉంది. త్వరలోనే అల్లు అర్జున్ మరో సినిమాను మొదలు పెట్టేందుకు ప్రముఖ దర్శకుడు ఏర్పాటు చేస్తున్నాడు. ఆ విషయమై త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# హను రాఘవపూడితో సినిమా.. ప్రభాస్ లుక్ కెవ్వుకేక!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న విషయం తెలిసిందే. లైనప్‌లో భారీ సినిమాలను ఇప్పటికే చేర్చిన డార్లింగ్.. ఓవైపు మారుతితో రాజా సాబ్ చేస్తున్నారు. కామెడీ హారర్ జోనర్‌లో రూపొందుతున్న ఆ సినిమా డిసెంబర్ 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాగా.. ఇప్పడికే ఆడియన్స్‌లో భారీ అంచనాలు ఉన్నాయి. మరోవైపు, ప్రభాస్.. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాను కూడా పూర్తి చేస్తున్నారు. పీరియాడికల్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఆ సినిమాలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగే కథతో సినిమా ఉండనుందని తెలుస్తోంది.

దీంతో ఆ మూవీపై కూడా వేరే లెవెల్ అంచనాలు ఉన్నాయి. ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తుండగా.. అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, రాహుల్ రవీం ద్రన్ వంటి పలువురు నటీనటులు కీలక పాత్రలు పోషిస్తు న్నారు. విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్ అందిస్తుండగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ భారీ బడ్జెట్‌తో రూపొంది స్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ స్టార్ట్ అవ్వగా.. ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో షూటింగ్ ఇప్పుడు జరుగుతున్నట్లు తెలుస్తోంది. త్వర లోనే మేకర్స్ క్రేజీ అప్డేట్ ఇవ్వనున్నట్లు కొద్ది రోజులుగా వార్తలు వస్తున్నాయి. అదే సమయంలో ఇప్పుడు సెట్స్ నుంచి స్పెషల్ పిక్ లీకై సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఫారిన్ నుంచి వచ్చిన ప్రభాస్ రీసెంట్‌గా సెట్స్‌కు వచ్చినట్లు తెలుస్తోంది. అందుకు సంబంధించిన పిక్ .. ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతోంది. అందులో ప్రభాస్ ఫార్మల్ ప్యాంట్, ఫార్మల్ షర్ట్ వేసుకుని ఉన్నారు. యమా క్లాసిక్‌గా కనిపించారు. సెట్స్‌లో ఓ కర్ర బెంచీపై ఉన్న డార్లింగ్.. క్లీన్ షేవ్, మీసాలతో కనిపించారు. దీంతో నెటిజన్లు, ఫ్యాన్స్ రెస్పాండ్ అవుతున్నారు. ప్రభాస్ లుక్ అదిరిపోయిందని నెటిజన్లు చెబుతున్నారు. సైనికుడిగా డార్లింగ్ వేరే లెవెల్‌లో కనిపించనున్నారని అర్థమవుతుందని అంటున్నారు. సూపర్ పిక్ అని చెబుతున్నారు. సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తున్నారు. సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. మూవీ కోసం వెయిట్ చేస్తున్నామని అంతా కామెంట్లు పెడుతున్నారు. మరి ప్రభాస్– హను రాఘవపూడి చిత్రం ఎప్పుడు రిలీజ్ అవుతుందో వేచి చూడాలి.

# తెలుగు చింపేసిన మీథా రఘునాదన్!



దేశ భాషలందు తెలుగు లెస్స. కానీ ఆ తెలుగును తెలుగు వాళ్లే సరిగ్గా మాట్లాడలేని పరిస్థితి అప్పుడప్పుడు సినిమా ఇండస్ట్రీలో కనిపిస్తుంటుంది. అలాంటి సందర్భం చూసినప్పుడల్లా తెలుగు భాష ఏమైపోతుందనే ఆందోళన వ్యక్తమవుతుంటుంది. తెలుగు మాట్లాడటం వచ్చినా? మాట్లాడని వారు చాలా మంది ఉన్నారు. స్వచ్ఛమైన తెలిసిన తెలుగు భాషలో మాట్లాడితే నామోషీ ఫీలవుతుంటారు. ప్రతిగా ఇంగ్లీష్ మాట్లాడుతుంటారు. ఇక హీరోయిన్ల విషయానికి వస్తే అందరూ తెలుగు నేర్చుకోలేకపోయినా కొందరు నేర్చుకుంటారు. నేర్చుకున్నంత వరకూ తెలుగులో మాట్లాడే ప్రయత్నం చేస్తుంటారు. ఇది హర్షించదగ్గ విషయం. వరుసగా అవకాశాలు వస్తున్నాయంటే తెలుగు ట్యూటర్‌ని పెట్టుకుని భాషపై పట్టు సంపాదించే ప్రయత్నం చేస్తుం టారు. నార్త్ కంటే సౌత్ నుంచి వచ్చిన భామలు తెలుగు భాష ఎక్కువగా మాట్లాడుతుంటారు. లేదంటే? కాజల్ అగర్వాల్, తమన్నా తెలుగు మాట్లాడినట్లే ఉంటుంది. కానీ ఓ తమిళ అమ్మాయి ఒక్క సినిమా కూడా రిలీజ్ అవ్వకుండా తెలుగు మాట్లాడిన తీరు చూస్తే ఎంతో ముచ్చటేస్తుంది. ఆమె మీథా రఘునాదన్. '3బీహెచ్ కె' సినిమాలో హీరోయిన్. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా అమ్మడు తెలుగు ఎంత చక్కగా మాట్లాడిందంటే? తెలుగులో మాట్లాడేందుకు ప్రయత్ని స్తున్నాను. ఏవైనా తప్పులుంటే క్షమించండని స్పీచ్ మొదలు పెట్టింది. మీరు నన్ను 'గుడ్ నైట్' సినిమాలో చూసి ఉంటారు. అందులో నా పాత్ర పట్ల చూపించిన ప్రేమకు ధన్య వాదాలు. చిన్నప్పుడు స్కూల్ ట్రిప్ కోసం హైదరాబాద్ తొలిసారి వచ్చాను. ఆ తర్వాత హైదరాబాద్ రావడం ఇదే. ఈ మధ్యలో ఎప్పుడూ రాలేదు. '3 బీహెచ్ కె'ని ప్రేమతో హృదయపూర్వకంగా చేసాం. అందరూ తప్పక చూడండి. ఆ సినిమా తర్వాత తెలుగులో మరిన్ని అవకాశాలు వస్తున్నాయని ఆశిస్తున్నా అంటూ ఎంతో చక్కాగా మాట్లాడింది. మీథా రఘునాధన్ తెలుగు మాట్లాడటం చూసి పక్కనే ఉన్న సిద్దార్ధ్ నోరెళ్ల బెట్టాడు. తమిళ అమ్మాయి ఇంత చక్కగా తెలుగు మాట్లాడుతుందేంటని ఓకింత ఆశ్చర్యపోయాడు. సాధారణంగా తమిళియన్స్ తెలుగు మాట్లాడటానికి ఇష్టపడరు. భాషా బేధంతో విడిపోయిన రాష్ట్రం కావడంతో తెలుగు పట్ల అసంతృప్తిని వ్యక్తం చేస్తుంటారు. కానీ మీథా రఘునాదన్ మాత్రం సినిమా రిలీజ్‌కు ముందే తెలుగు వాళ్ల మనసుల్లో స్థానం సంపాదించింది.

# యునైటెడ్ క్రైస్ట్ చర్చ్ సంఘాలకు లీగల్ అడ్వైజర్‌గా బాధ్యతలు స్వీకరించిన బిఎస్ కృష్ణ(ఆల్ఫా కృష్ణ)



**(రాజధాని వార్తలు):** యునైటెడ్ క్రైస్ట్ చర్చ్ సంఘాలకు లీగల్ అడ్వైజర్‌గా బాధ్యతలు స్వీకరించిన బిఎస్ కృష్ణ (ఆల్ఫా కృష్ణ) ప్రముఖ వ్యాపారవేత్త ఆర్టిఐ హ్యూమన్ రైట్స్ సౌత్ ఇండియా చైర్మన్ నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ నేషనల్ స్పోక్స్ పర్సన్ విశాఖ జిల్లా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సిటీ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఆల్ఫా ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయినటువంటి ఆల్ఫా కృష్ణకి యునైటెడ్ క్రైస్ట్ చర్చ్ వారి సంఘాలకు లీగల్ అడ్వైజర్‌గా బాధ్యతలు అప్పజెప్పిన యునైటెడ్ క్రైస్ట్ చర్చ్ సంఘ సభ్యులు ఈ సందర్భంగా ఆల్ఫా కృష్ణ మాట్లాడుతూ తన మీద వారికున్న నమ్మకానికి ఆయనకు అప్పజెప్పిన బాధ్యతలు విషయంలో నూటికి నూరు శాతం న్యాయం చేస్తానని సభాముఖంగా హామీ ఇచ్చారు. యునైటెడ్ చర్చ్ సంఘాల అభివృద్ధి విషయంలో మునిపన్నుడు చూడని విధంగా అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్తానని దేవుడిచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఒక్కరికి న్యాయం చేకూరుస్తానని రాష్ట్రంలోనే అత్యున్నతమైన ప్రజా ధారణ కలిగిన యునైటెడ్ చర్చ్ సంఘానికి ఆయనకి లీగల్ అడ్వైజర్‌గా బాధ్యతలు అప్పగించినందుకు యునైటెడ్ చర్చ్ సంఘ సభ్యులకు అడ్వైజర్ బోర్డు కమిటీ కి డీకంబోర్డు కమిటీ సభ్యులకి మహిళా కమిటీ సభ్యులకు యూత్ కమిటీలో ఉన్న సభ్యులందరికీ మరియు యునైటెడ్ క్రైస్ చర్చ్‌లో ఉన్న ప్రతి ఒక్క సభ్యుడికి ఆయన హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# విశాఖలో నిలిచిపోయిన నీటి సరఫరా

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వేతనాలు పెంచాలని, 2 నెలల బకాయిలు చెల్లించాలని ఆప్కాస్ కార్మికుల సమ్మె కారణంగా విశాఖలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జివిఎంసి నీటి సరఫరా విభాగంలో మొత్తం 1100 మంది కార్మికులు ఉండగా 800 మంది ఆప్కాస్ కార్మికులు ఉన్నారు. దీంతోపాటు ట్యాంకర్ల ద్వారా అపార్ట్మెంట్లు, ఇతర అవసరాలకు నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న టౌన్ సర్వీస్ రిజర్వాయర్ వద్ద ట్యాంకర్లు బారులు తీరాయి.



# ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీపై నిర్ణయం ప్రకటించాలి : ఆదివాసీ గిరిజన సంఘం





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్‌పై ప్రభుత్వం నిర్ణయం ప్రకటించాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. విశాఖలోని కంచరపాలెంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర మాట్లాడారు. ఏజెన్సీలోని బాక్సైట్ను 'నాల్కో'కు అప్పగించే ప్రయత్నాలను ఖండించారు. ఆదివాసీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందం రద్దు చేయాలన్నారు.

# ఓలా, ఊబర్లో ఆ వ్యవస్థ తొలగించాలి : సిఐటీయు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఓలా, ఊబర్, రాపిడోల రాడార్ వ్యవస్థ డ్రైవర్లపై ఒత్తిడిని పెంచుతోందని సిఐటియు నాయకులు రాజ్ కుమార్ అన్నారు. జగదాంబలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ వ్యవస్థ ద్వారా ఒకేసారి ఐదుగురికి పికప్ ఇస్తున్నారన్నారు. డ్రైవర్లు టిప్స్ కోసం ఒత్తిడికి గురై ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ వ్యవస్థను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వమే యాప్ తేవాలన్నారు.



# విశాఖలో నిలిచిపోయిన నీటి సరఫరా

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జివిఎంసి పరిధిలో 3 లక్షల తాగునీటి గృహ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతిరోజు 60 మిలియన్ గ్యాలన్ల నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నామని నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీరు కె.వి.ఆర్.ఎన్.రవి తెలిపారు. పరిశ్రమలకు మరో 15 మిలియన్ గ్యాలన్ల నీటిని అందజేస్తున్నామని చెప్పారు. ఆప్కాస్ కార్మికుల సమ్మె కారణంగా నీటి సరఫరాపై ప్రభావాన్ని అంచనా వేస్తున్నామని తెలిపారు. అటు ఎయిర్ పోర్టు, కెజిహెచ్‌కు కూడా నీటి సరఫరా నిలిచిపోయింది.

# సీపీకి రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం సత్కారం

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** యోగాంధ్రలో సమర్థవంతమైన భద్రత ఏర్పాటు చేసిన పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చిని విశాఖ జోన్ రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం శుక్రవారం అభినందించింది. సం ఘం ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి శామ్యూల్, కార్యనిర్వాహక కార్యదర్శి సురేశ్ బాబు సీపీకి శాలువా కప్పి సత్కరించారు. మంచి ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేశారని ప్రశంసించారు. కోశాధికారి ప్రేమ్ బాబు, దివాకర్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



# పాడేరు నియోజకవర్గం ప్రధాన పరిశీలకులుగా బుద్ధ నాగ జగదీష్



**పాడేరు, (రాజధాని వార్తలు):** పాడేరు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులుగా మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నియమించిన సంస్థాగత ఎన్నికల నిర్వహణ కోసం ఈరోజు ఉదయం పాడేరులో ఇంచార్జ్ శ్రీమతి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాగ జగదీష్ మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో కార్యకర్తలకు నాయకులకు సమాచారం ఇచ్చి సమావేశం ఏర్పాటు చేసి గ్రామ కమిటీలు ఎన్నుకోవాలని, అనంతరం మండల కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని, కస్టర్ కమిటీలు, 100 మందికి ఒకరు చొప్పున రాష్ట్రపతి చెప్పిన ప్రకారం ఎన్నికల నియమావళి ప్రకారం కమిటీలలో రిజర్వేషన్ పక్కాగా పరిగణంలోకి తీసుకొని కమిటీలు నియమించుకోవాలని నాగ జగదీష్ సూచించారు. ఈ కార్యక్రమంలో పాడేరు నియోజకవర్గంలో మండలాలకు కేటాయించిన పరిశీలన గవిరెడ్డి వెంకటరమణ నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ చైర్మన్ పాయకరావుపేట మార్కెట్ కమిటీ పార్టీ నాయకులు వంతల నాగేశ్వరరావు పాడేరు రహిమాన్ జి.మాడుగుల దాసుబాబు చింతపల్లి టి సుబ్బారావు జీకే గూడెం యస్ సుబ్బారావు కయ్యూరు తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం పాడేరు ఇంచార్జ్ గడ్డి ఈశ్వరి నాగ జగదీష్‌ను శాలువాతో సత్కరించి శ్రీశ్రీశ్రీ మోదికొండమ్మ అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు.

# కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథ స్వామివారు





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి గవరపాలెం అగ్రిమరి చెట్టు వద్ద కొలువైన శ్రీ సుభద్రా బలభద్ర సమేత జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవ భాగంగా గూడ్స్ రోడ్ వద్ద ఉన్న ఇంద్రజమ్మ హాలు వద్ద కొలువైన సుభద్రా బరభద్ర జగన్నాథ స్వామి వారు శనివారం భక్తులకు కూర్మావతారంలో దర్శనమిచ్చారు. ఆలయ మండపంలో బొండ ప్రమీల ఆధ్వర్యంలో సుందరాకాండ పారాయణం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ కార్య నిర్వహణ అధికారి బి మురళీ, ఆలయ కమిటీ ధర్మకర్తలు. బుద్ధ ఆదిలక్ష్మి, యల్లబిల్లి ధనలక్ష్మి, కాండ్రేగుల మహాలక్ష్మి, పేకేటి తులసి, భుగాతా కోటేశ్వరరావు, యండపల్లి చంద్రశేఖర్, మంగళపల్లి వివి సుబ్రహ్మణ్యం, బోడ్డేడ వెంకట చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

# జీవో 114పై హర్షం వ్యక్తం చేసిన క్రెడాయ్ ప్రతినిధులు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** గృహ నిర్మాణ రంగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 114 పై క్రెడాయ్ విశాఖ విభాగం చైర్మన్ వి.ధర్మేంద్ర, ప్రెసిడెంట్ ఇ.అశోక్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ జీవో ద్వారా ఏపీ భవన నిర్మాణ నిబంధన-2017ల్లో అనేక సవరణలు చేశారని తెలిపారు. దీని ద్వారా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ జరుగుతుందన్నారు. పెట్టుబడులకు మార్గం సుగమం అవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.




# ఇళ్ల నిర్మాణానికి అదనంగా రూ.3,200 కోట్లు : మంత్రి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేందుకు రూ.3,200 కోట్లు అదనపు ఆర్థిక సహాయం ఇచ్చామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. విశాఖ కలెక్టర్ ఆఫీసులో శుక్రవారం గృహ నిర్మాణాలపై సమీక్ష అనంతరం విలేకరులతో మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణంపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందన్నారు. కూటమి ప్రభుత్వం పరిస్థితులను చక్కబెడుతోందని తెలిపారు.

# ఆనందోత్సాహాల మధ్య జగన్నాథ రథయాత్ర

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖలోని ఉత్కల్ సంస్కృత సమాజ్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర శుక్రవారం వైభవంగా జరిగింది. సిరిపురం ఆల్ ఇండియా రేడియో సమీపంలోని ఆలయం గర్భగుడి నుంచి జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రలను ఉత్సవంగా బయటకు తీసుకువచ్చి, రథంపై ఉంచారు. అనంతరం చెరా పహాంరా ఆచారం నిర్వహించారు. భక్తులు ఆనందోత్సాహాల మధ్య రథాన్ని లాగారు. లాసన్స్ బే కాలనీలోని గుడించి ఆలయానికి దేవతలను తీసుకు వెళ్లారు.



Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan